## అక్రమ నిర్మాణాల నిలిపివేత..



అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్న మున్సిపాలిటీ పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 3 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను శనివారం మున్సిపాలిటీ పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదులతో నిర్మాణాలను అడ్డుకుంటున్నామని మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజు, నరేందర్ పాల్గొన్నారు.

## తెగుళ్లు సోకకుండా పంటలు పండించాలి

**మండల వ్యవసాయ అధికారి తులసి**

చేవెళ్లరూరల్, ఫిబ్రవరి 3 : రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి, తెగుళ్లు సోకకుండా పంటలు పండించాలని మండల వ్యవసాయ అధికారి తులసి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో ఆమె శనివారం పర్యటించి వంకాయ, కుసుమ పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో సాగు చేసి తెగుళ్లు సోకకుండా చర్యలు తీసుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఏవో వెంట వ్యవసాయ విస్తరణాధికారి రాజేశ్వర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.



పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి తులసి, వ్యవసాయ విస్తరణాధికారి రాజేశ్వర్‌రెడ్డి



వైద్యాధికారుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# మెరుగైన వైద్యం అందించాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 3 : వైద్యం కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైద్యులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో శనివారం వైద్యాధికారులకు సమావేశాన్ని నిర్వహించారు. దవాఖానలోని మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు దవాఖానలో రోగులకు అవసరమయ్యే మౌలిక వసతులను కల్పించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు చేయాలన్నారు. వైద్యం పేరిట పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని ప్రైవేట్ దవాఖాన నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్, జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, నందిగామ ఎంపీపీ ప్రియాంక, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం యాదగిరి

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**నందిగామ ఏపీఎం యాదగిరి**

నందిగామ, ఫిబ్రవరి 3 : ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నందిగామ ఏపీఎం యాదగిరి అన్నారు. నందిగామ మండలం జంగోనిగూడ గ్రామంలోని శనివారం మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులతో ఏపీఎం యాదగిరి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఇస్తున్న రుణాలతో వ్యాపారాలు చేసుకునేందుకు దోహదపడుతాయని మహిళలకు అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించాలని సూచించారు.

## సర్పంచ్‌ల సేవలు భేష్

**ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి**

కొత్తూరు, ఫిబ్రవరి 3 : ఐదేండ్ల కాలంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు ఎంతో కృషి చేశారని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని మక్తగూడలో యూత్ ఆధ్వర్యంలో పంచాయతీ మాజీ పాలకవర్గాన్ని శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను సన్మానించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ఐదేండ్ల కాలంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పారు. కార్యక్రమంలోఎంపీడీవో శరత్‌చంద్రబాబు, ప్రత్యేక అధికారి ఆర్‌అండ్‌బీ ఏఈ సందీప్, మక్తగూడ సర్పంచ్ కాట్న రాజు, ఉప సర్పంచ్ వడ్డె పొన్నమ్మ, గూడూరు ఉప సర్పంచ్ దయానంద్‌గుప్తా, మాజీ సర్పంచ్ రాందాస్‌నాయక్, మాజీ ఎంపీటీసీ మోడీ దర్శన్, మాజీ వార్డు మెంబర్ రాజుగౌడ్, పాండు, శ్రీరాములు, రాములుగౌడ్ పాల్గొన్నారు.



మక్తగూడ గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంపీపీ మధుసూదర్‌రెడ్డి

## వెంకమ్మగూడ పాలకవర్గానికి సన్మానం




నందిగామ, ఫిబ్రవరి 3: నందిగామ మండలం వెంకమ్మగూడ సర్పంచ్ బుయ్యని రజనీతగౌడ్‌తో పాటు పాలకవర్గం సభ్యులను శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాలుగా గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని సర్పంచ్ రజనీతగౌడ్ పాలకవర్గం సభ్యులను అభినందించారు.

# వ్యర్థాలను పారబోస్తే జరిమానా



ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 3 : 'బైపాస్‌ను.. భరించలేం' అనే శీర్షికతో శుక్రవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్‌రోడ్డులో నిత్యం ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం పడవేయటంతో దుర్గంధభరితంగా మారింది. దీనిపై నమస్తే తెలంగాణ ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు శనివారం బైపాస్‌రోడ్డును పూర్తిగా శుభ్రం చేయించారు. ఇకపై బైపాస్ రోడ్డుపై చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు.

## కత్తి పద్మారావుపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 3: అయోధ్యలో రామ మందిరం నిర్మాణంపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న కత్తి పద్మారావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమైక్య హ్యూమన్ రైట్స్ చైర్మన్ సాయికుమార్‌గౌడ్ అన్నారు. శనివారం రామ మందిరం తీర్పుపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న కత్తి పద్మారావుపై శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అత్యున్నత ధర్మాసనం ఇచ్చిన తీర్పును తప్పుపట్టడం సరైన పద్ధతి కాదని అన్నారు. కత్తి పద్మారావును వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరేశం, రాకేశ్, భాగ్యరాజ్ పాల్గొన్నారు.



ఎస్ఐ సంతోష్‌రెడ్డి కి ఫిర్యాదు చేస్తున్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యుడు తదితరులు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

## క్రమశిక్షణతో పని చేయాలి

**వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి**

వికారాబాద్, ఫిబ్రవరి 3 : సిబ్బంది వెల్ఫేర్ విషయంలో ఎల్లప్పుడూ ముందుంటామని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ పోలీస్, ఏఆర్ పోలీస్ అధికారులకు మొబిలైజేషన్‌తో క్రమశిక్షణతో పని చేయడం అలవాటు పడుతుందన్నారు. ఈసారి మొబిలైజేషన్ కార్యక్రమంలో ఏవో, ఐటీసీటీ అధికారులతో, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ అధికారులు, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలీస్ అధికారులు సిబ్బంది తమ ఆరోగ్యం, కుటుంబ విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు, సిబ్బంది కలిసి మెలిసి ప్రశాంతమైన వాతావరణంలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సిబ్బంది వెల్ఫేర్ విషయంలో ఉన్నత అధికారులు ఎల్లప్పుడూ ముందుంటారని, ఇకముందు పోలీస్ అధికారులు, సిబ్బందికి, పోలీస్ కుటుంబ సభ్యులకు మెడికల్ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని వివరించారు. సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ యు. రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఏవో జోతిర్మయి, ఆర్ఐ అంజాద్‌పాషా, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్, డీవీపీ రాజు, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పోలీసులు

### 16న గ్రామీణ బంద్

షాద్‌నగర్, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మిక రైతు విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న గ్రామీణ బంద్ అనే నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి. శ్రీనునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘంతో పాటు సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని, కేంద్ర విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

## సమాజ సేవలో భాగస్వాములు కావాలి

కడ్తాల్, ఫిబ్రవరి 3: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కడ్తాల్ జడ్పీటీసీ, రాధాకృష్ణ ట్రస్టు చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన గొట్టె కాశయ్య పది రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ శనివారం నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి ట్రస్టు తరపున జడ్పీటీసీ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన ఎగిరిశెట్టి శంకరయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, నాయకులు వీరయ్య, జంగయ్యగౌడ్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్, జంగయ్య, భిక్షపతి పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

## మహిళ మెడలోంచి పుస్తెల గొలుసు చోరీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 3: రాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న ఓ మహిళ మెడలోంచి పుస్తెల గొలుసును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. ఈ ఘటన ఆమనగల్లు పట్టణంలోని ఉదయ్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై బాల్‌రామ్ తెలిపిన వివరాల ప్రకారం ఆమనగల్లు పట్టణంలోని ఉదయ్‌నగర్ కాలనీకి చెందిన తోకల అరుణ, భర్త యాదయ్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి తలుపులు తెరిచి ఇంట్లో నిద్రిస్తున్నారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తోకల అరుణ మెడలో ఉన్న పుస్తెల గొలుసును తెంచుకుని పారిపోయాడు. గొలుసు రోల్డ్‌గోల్డ్‌ది కాగా, పుస్తెలు బంగారువని వాటి విలువ రూ.6వేలు ఉంటుంది. బాధితురాలు అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రామ్ తెలిపారు. ఘటన స్థలాన్ని ఏసీపీలు శశాంక్‌రెడ్డి, హుస్సేన్‌నాయుడు ఆమనగల్లు, కడ్తాల సీఐలు వెంకటేశ్వర్లు, శివప్రసాద్ పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ బాల్‌రామ్

### కంప చెట్లను తొలగించండి

**మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌కు వినతి పత్రం అందజేసిన కాలనీ వాసులు**



కమిషనర్ శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శాంతినగర్ కాలనీ వాసులు

ఆమనగల్లు, జనవరి 3 : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఇండ్ల మధ్యన ఏపుగా పెరిగిన కంప చెట్లు, పాడుబడిన గోడలను తొలగించాలని కోరుతూ శనివారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. దోమల బెడద, ఇండ్ల మధ్య పాములు సంచరిస్తున్నాయని, రాత్రి సమయంలో భయంగా ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కంప చెట్లు, పాడుబడిన గోడలను తొలగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు రాజు, విజయలక్ష్మి, స్వప్న, అలివేలు, జ్యోతి, మణెమ్మ, విమలమ్మ, సులోచన, కావ్య ఉన్నారు.

### జేఎన్టీయూలో 10న ఇంక్యుబేటర్ కెపాసిటీ బిల్డింగ్ ప్రొగ్రామ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): జేఎన్టీయూ, ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఇంక్యుబేటర్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ వర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.శ్రీదేవి పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం జేఎన్టీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

### లక్కీడ్రా పేరుతో కుచ్చు టోపి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 3 : లక్కీడ్రా పేరుతో ప్రజలకు కుచ్చు టోపి పెట్టి ఉడాయించిన ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం... మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్ హిల్స్‌లో మదన్‌కుమార్‌గౌడ్ అనే వ్యక్తి డీఎంఎస్ ఎంటర్‌ప్రైజెస్ పథకాన్ని సీజన్‌వారీగా 15 నెలల నుంచి నడుపుతున్నాడు. ప్రతి నెల సభ్యులుగా చేర్చుకున్న వారి నుంచి రూ.1100 వసూలు చేసేవాడు. ఈ క్రమంలో పలువురు డబ్బులు చెల్లించగా ప్రస్తుతం డ్రా తీయడం మానేశారు. బాధితులకు అనుమానం వచ్చి అతడికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో మోసపోయామని గ్రహించిన దీపిక, భారతి, నందిని పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

కొత్తూరు, ఫిబ్రవరి 3: మండల కేంద్రం కొత్తూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి విజ్ఞప్తి చేశారు. మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో కొత్తూరులో శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తూరు మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, వృత్తి విద్యా కళాశాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేయాలని సమావేశంలో తీర్మానించామని అన్నారు. సమావేశంలో ఏబీవీపీ మండల కో కన్వీనర్ శివకుమార్‌చారి, మండల కార్యదర్శి హర్షయాదవ్, సుమిత్‌కుమార్, రాజీవ్‌కుమార్, సుదర్శన్, రవితేజ, నితీశ్, నిలకంఠ పాల్గొన్నారు.

### నేడు ఇంటర్ సీవోఈ ప్రవేశ పరీక్ష

మొయినాబాద్, ఫిబ్రవరి 3 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సీఈవో జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందడానికి నేడు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సీఈవో జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో సీటు పొందడానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు వికారాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్, ఆధార్‌కార్డు లేదా ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు పొందిన పత్రాన్ని తీసుకుని రావాలని చెప్పారు.

### ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి అభరణాలు అపహరణ

ఆమనగల్లు, ఫిబ్రవరి 3: ఇంటికి ఉన్న తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బంగారు గుండ్లదండ, వెండి పట్టీలు , కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ ఘటన ఆమనగల్లు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై బాల్‌రామ్ కథనం ప్రకారం.. ఆమనగల్లు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న పాతకోట కిష్టమ్మ రోజు రాత్రి సమయంలో తన ఇంట్లో భోజనం చేసిన అనంతరం అదే కాలనీలో నివాసం ఉంటున్న తన రెండో కుమారుడు సాయిలు ఇంట్లో పడుకుని ఉదయం తన ఇంటికి వచ్చేది. రోజువారీ మాదిరిగానే శుక్రవారం రాత్రి తన కుమారుడు సాయిలు ఇంట్లో పడుకుని శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం తీసి ఉంది. బీరువాలో పావుతులం బంగారు గుండ్ల దండ, 25 తులాల వెండి కాళ్ల పట్టీలు, కొంత నగదు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రామ్ తెలిపారు.

### నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కడ్తాల్, ఫిబ్రవరి 3: కడ్తాల్ గ్రామ నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు బీసీ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫీవుద్దీన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ నాయీబ్రాహ్మణ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గ్రామాధ్యక్షుడిగా కానుగుల లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా కానుగుల శివ, కార్యదర్శిగా కానుగుల మహేందర్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను నియామక పత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జంగయ్య, అంజయ్య, శంకరయ్య, శ్రీను, సత్తయ్య, శ్రీనివాస్, మహేశ్, వెంకటేశ్, గోపాల్, కరుణాకార్, మురళీ, రాజు, గణేశ్ పాల్గొన్నారు.



నాయీబ్రాహ్మణ నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న ఎన్నికల పరిశీలకుడు